క్లుప్తంగా

నవధాన్యాలతో నేల సారవంతం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్త జానకి

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. నవధాన్యాల సాగుతో భూమిలో జీవవైవిధ్యం, సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ కార్యకర్త మంత్రబుద్ధి జానకి వివరించారు. రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు.

వేగవంతంగా ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలో ఇంటింటి కుళాయిల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన అంటిపేట పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాపురం, వెన్నెల బుచ్చింపేట, అంటిపేట గ్రామాల్లోని కాలనీల్లో ఆదివారం పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావచ్చాయన్నారు. త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా కుళాయిలను ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్న

సీతానగరం: మండలంలోని రైతులు పండిస్తున్న మొక్క జొన్నపంటకు గిట్టుబాటు ధరకల్పించాలని సీపీఐ జిల్లాసహాయ కార్యదర్శి టి జీవన్న కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన బూర్జ వచ్చిన సందర్భంగా జొన్నపంట సాగు రైతులతో మద్దతు ధరపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల ధరలు గణనీయంగా పెరిగినా రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించక పోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం రైతుల పొలాల్లో పండించిన మొక్క జొన్న పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో పంటంతా నూర్పిడి చేసిన కళ్లాల్లోనే గింజలు నిల్వలుంచాల్సి వస్తుందన్నారు. క్వింటా జొన్నగింజలు ఇంతవరకూ రూ.2,400లు కొనుగోలు చేశారన్నారు. పంట విక్రయానికి వచ్చేసమయానికి రూ.1,900లు మించి కొనలేమని వర్తకులు అంటున్నారని ఆరోపించారు. జొన్నపంటకు గిట్టుబాటు ధరకల్పించాలని అన్ని ప్రాంతాల్లో జొన్నపంటకు మద్దతుధర పెంచాలని కోరుతూ ఆందోళన చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న గింజలు క్వింటాకు రూ.2,500 చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కృష్ణారావు, గోపీనాయుడు, ధనంజయ్ పాల్గొన్నారు.

24మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



పెదపెంకిలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆప్థాలమిక్ కిరణ్

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 24మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్లసంజీవనాయుడు ఆధ్వర్యంలో తాటిబంద ప్రాథమిక పాఠశాల వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 24మందికి పరీక్షలు నిర్వహించగా 15మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు ఆప్థాలమిక్ కిరణ్ తెలిపారు. వారిని విజయనగరంలోని వెంకట పుష్పగిరి హాస్పిటల్‌కు తీసుకువెళ్లి శస్త్ర చికిత్సలు పూర్తిచేసిన తరువాత తిరిగి పెదపెంకి గ్రామానికి చేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పి.శంకర్, ఈ.మధు, డి.జశ్వంత్, కె.సతీష్, ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి..

సాలూరు: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. పట్టణంలో వెలమపేట రామమందిరం వద్ద ఆదివారం జరిగిన అన్నసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, గులిపల్లి గణేష్ దంపతులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



కురుపాం: బియ్యాలవలసలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత



గరుగుబిల్లి: పెద్దూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గరుగుబిల్లి: ఉల్లిభద్రలో ఓ ఇంటికి జగనన్న స్టిక్కరును అతికిస్తున్న గృహసారథులు



భామిని: భామినిలో ఇంటింటి ప్రచారంలో గృహసారథులు, పార్టీ నాయకులు

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు నిరంతరం కృషిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. టీడీపీ తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని, గతంలో టీడీపీ ప్రభుత్వం ఏం చేసింది, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలు బేరీజు వేసుకొని రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: కీసరజోడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



భామిని: నల్లరాయిగూడలో జగనన్న స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాలకొండ: కొండాపురంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు



పాలకొండ: గృహసారథులకు, వలంటీర్లుకు సిక్కర్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త..!

- రోజురోజుకు పెరుగుతున్న ఎండలు
- చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు



చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న డాక్టర్

పాలకొండ రూరల్: వేసవిలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఎండల దాటికి ప్రజలు అల్లాడుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు చిన్నపిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉన్నా..బయటకు వెళ్లినా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఆరోగ్యపరమైన ఇబ్బందుల బారినపడే అవకాశం ఉందని పాలకొండ ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యనిపుణుడు జె.రవీంద్రకుమార్ సూచిస్తున్నారు.

చిన్నారుల విషయంలో..

- చంటిపిల్లల్లో శరీరంలో ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచేందుకు అధిక మోతాదులో తల్లిపాలు పట్టాలి.
- చిన్నారుల శరీర ఉష్ణోగ్రత పెరిగితే పచ్చకామెర్లు (జాండిస్) సోకే ప్రమాదం ఉంటుంది.
- మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలకు దాహం తీరేవరకు(తరచూ) నీటిని అందిస్తూ ఉండాలి.
- వేడి గాలుల నుంచి రక్షణ కోసం పలుచని కాటన్ దుస్తులు ధరించాలి. ఈ దుస్తులు ఎప్పటికప్పుడు తడిపి వాడటం మంచిది.
- మూత్రం క్రమంగా రాకపోవడం, నోరు తడి ఆరిపోవడం, చర్మం పొడిబారడం, వాంతులు, విరేచనాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- శరీరానికి చల్లదనం చేకూర్చే కొబ్బరి, బార్లి నీళ్ల వంటివి ఇవ్వడం శ్రేయస్కరం.
- మూడేళ్ల పైబడిన పిల్లల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో వీరికి మూత్ర పిండాల సంబంధిత సమస్యలు అధికంగా వస్తుంటాయి.
- విపరీతమైన జ్వరం, మూత్ర విసర్జన సరిగా లేకపోవడం, నీరసంగా ఉండడం, నాలుక తడి ఆరిపోవడం జరుగుతుంటుంది. ఈ సమయంలో అధిక శాతం నీటిని అందించాలి.
- పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలు, వృద్ధులు శరీరంలో ఉష్ణోగ్రతల సమతుల్యతను కాపాడుకునేందుకు వైద్యుల సూచనలు తీసుకోవాలి.

ఆహారపు అలవాట్లు..

ఎండను తట్టుకునేందుకు శీతల పానీయాలు, జ్యూస్‌లు వంటివి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదికాదు. వాటిని సేవించటం వలన శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. అంతేకాకుండా రక్తంలో పాస్పరస్ అధికంగా చేరుతుంది. దీనివల్ల ఎముకలు, దంతాలు, కిడ్నీ సంబంధింత ఇబ్బందులు వస్తాయి. కావున వీటిని సాధ్యమైనంత వరకు తీసుకోకపోవడం మంచిది. ఎక్కువగా నీరు తాగాలి. శరీర ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించేందుకు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. ముఖ్యంగా పాలకూర, ముల్లంగి, వెల్లుల్లి, నీరుల్లి, బీట్‌రూట్ తదితర ఆకు కూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలి. అలాగే వివిధ రకాల పండ్లు తీసుకోవడం ఉత్తమం. శరీరం నుంచి చెమట రూపంలో కోల్పోయిన లవణాలను తిరిగి పొందేందుకు మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

స్నేహితుడికి సాయం



శ్రీనివాసరావుకు నగదు, వస్త్రాలు అందజేస్తున్న మిత్రులు

పాలకొండ రూరల్: చిన్నప్పుడు తమతో కలిసి చదువుకున్న మిత్రుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకుని తోటి స్నేహితులు అండగా నిలిచారు. పట్టణానికి చెందిన ఒప్పంగి శ్రీనివాసరావుది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. పైగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన కుమార్తెకు వివాహం కుదిరింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న స్నేహితుని పరిస్థితి తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు దిలీప్‌కుమార్, శిల్లా మల్లేశ్వరరావు, తలే సీతారాము తదితరులు ఆదివారం మిత్రుడు శ్రీనివాసరావుని కలిసి ధైర్యం చెప్పారు. ఆయన కుమార్తె వివాహం కోసం రూ.20 వేల నగదు, పట్టువస్త్రాలు అందించారు. మిగిలిన స్నేహితులతో కలిసి మరింత సహకారం అందిస్తామన్నారు.

హెచ్‌సీ దాతృత్వం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

కొమరాడ: పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మండలంలోని సర్వపాడు గ్రామంలో ఇంటిగోడ కూలిపోయి ప్రాణాలు కోల్పోయిన కేంద్రీక శంకరరావు, జీలకర్ర మాణిక్యమ్మ కుటుంబ సభ్యులకు, ఇదే ప్రమాదంలో గాయపడిన మెల్లక రాజు, జీలకర్ర హరికృష్ణ, మండంగి రవిలకు రూ.5వేలు చొప్పున నగదుతో పాటు 78 కిలోల బియ్యం అందజేశారు. సర్పంచ్ హిమరిక గంగాధర్ చేతులమీదుగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

పార్కులో పర్యాటకుల సందడి



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న సందర్శకులు



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

సీతంపేట: స్థానిక అడ్వంచర్ పార్కులో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో చిన్నారులు, పెద్దలు పార్కుకు వచ్చి కాసేపు సేదతీరారు. జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై వాకింగ్, స్కై సైక్లింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అలాగే సమీపంలోని మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

మందుల ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెంటపాటి సూర్యారావు

పార్వతీపురంటౌన్: ఔషధ నియంత్రణ సంస్థ మందుల ధరలు తగ్గించాలని వినియోగదారుల సంఘం పార్వతీపురం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వినియోగదారుల సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర మందుల జాబితాలో సుమారు 650 రకాల ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఏప్రిల్ 1 నుంచి తగ్గిన మందుల ధరలు అమలు చేయనందున వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైల్ దుకాణ దారులు పాత ధరలకే అమ్ముతున్నారని, వాటిపై ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం నిఘా పెట్టాలని అభిప్రాయ పడ్డారు. మందుల ధరలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్



సీతంపేట: సోమగండిలో ఈస్టర్ కేక్ కట్ చేస్తున్న చర్చి ఫాదర్లు

లోకరక్షకుడైన ఏసుక్రీస్తు పునరుత్థానం(సమాధి నుంచి తిరిగిరావడం)ను పురస్కరించుకుని క్రీస్తు విశ్వాకులు ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయన రాకను స్వాగతిస్తూ శనివారం రాత్రి నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రార్థనా గీతాలు ఆలపించారు. చర్చి ఫాదర్లు గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండగ విశిష్టతను వివరించారు. క్రీస్తు విశ్వాసకులు పెద్ద సంఖ్యలో హాజరై కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: ఆర్‌సీఎం చర్చ్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కురుపాం: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పాలకొండ రూరల్: ఆర్‌సీఎం లూర్దుమాతా చర్చిలో కొవ్వొత్తుల వెలిగించి ప్రార్థనలు చేస్తున్న విశ్వాసకులు



సీతంపేట: పత్తికగూడ ఫాతిమా మాతా చర్చిలో దేవుని వాక్యాన్ని వినిపిస్తున్న ఫాదర్లు



భామిని: నేరడిలో వేకుమజాము ప్రార్థనల్లో క్రైస్తవులు



భామిని: బత్తిలి చర్చ్‌లో దైవ వాక్యాలు వినిపిస్తున్న ఫాదర్ రాజు



కురుపాం: గుడ్‌సమారిటిన్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రీస్తు విశ్వాసకులు



వీరఘట్టం: సీబీఎం చర్చ్‌లో క్రైస్తవుల ప్రార్థనలు



గుమ్మలక్ష్మీపురం: ఎస్.కె.పాడు చర్చి వద్ద బాణసంచా వెలుగులో ఈస్టర్ వేడుకలు